కరకట్ట నిర్మాణ పనులు ప్రారంభించాలి : కలెక్టర్

మంగపేట : గోదావరి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ దివాకర

మంగపేట/ వెంకటాపురం (నూగూరు) జూన్ 20 : నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ గోదావరి కరకట్ట పనులు తక్షణమే ప్రారంభించాలని కలెక్టర్ దివాకర నీటి పారుదల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన మంగపేట మండలంలోని గోదావరి తీర ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కరకట్ట నిర్మాణానికి మంజూరైన నిధుల వివరాలు తెలుసుకున్నారు. రూ. 64 కోట్లతో 2.5 కిలోమీటర్ల పొడవునా కరకట్ట నిర్మాణం పూర్తయితే గోదావరి పరివాహక ప్రాంతంలో ఉన్న గ్రామాలు సురక్షితంగా ఉంటాయని తెలిపారు. పనుల్లో కాంట్రాక్టర్లు, అధికారులు నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. అలాగే వెంకటాపురం (నూగూరు) మండలంలో కలెక్టర్ పర్యటించారు. కుక్కతోగు వాగు, బల్లకట్టు వాగు, కంకల వాగు, పాలెం వాగు ప్రాజెక్టును ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గోదావరి వరదల సమయంలో మండల అధికారులు స్థానికంగా ఉంటూ ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ఆ నంతరం వీఆర్‌కే పురంలో జరుగుతున్న మీషన్ భగీరథ సర్వేను ఆయన పరిశీలించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్లు వీర స్వామి, వీరభద్రప్రసాద్, వెంకటాపురం (నూ) మండల ప్రత్యేకాధికారి స్వర్ణలత లెనినా, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్, నీటి పారుదలశాఖ ఈఈ జగదీశ్వర్, డీఈఈ రవికుమార్, ఏఈ వలీ అహ్మద్, ఎంపీవో హనుమంతరావు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్ పనుల్లో నాణ్యత పాటించాలి

ములుగు అదనపు కలెక్టర్ శ్రీజ

ఎన్‌హెచ్ పనులను పరిశీలిస్తున్న శ్రీజ

ములుగురూరల్, జూన్ 20 : జాతీయ రహదారి 163 విస్తరణ పనుల్లో నాణ్యత పాటించేలా జాతీయ రహదారుల శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ శ్రీజ అన్నారు. గురువారం ఆమె మల్లంపల్లి నుంచి మహ్మద్‌గౌస్‌పల్లి వరకు చేపట్టిన ఎన్‌హెచ్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. పనులు చేపట్టే ముందు ప్రమాదాలు జరగకుండా సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలన్నారు. సీసీ పనులకు క్యూరింగ్ చేపట్టాలన్నారు.

మిషన్ భగీరథ సర్వేను పూర్తి చేయాలి

గోవిందరావుపేట : గ్రామాల్లో చేపట్టిన మిషన్ భగీరథ సర్వేను రెండు రోజుల్లో పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్రీజ అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె మండలంలోని చల్వాయి, రాంనగర్ గ్రామాల్లో పర్యటించి సర్వే తీరును పరిశీలించారు. ప్రభుత్వం నిర్దేశించిన ఫార్మట్ ప్రకారం సర్వేను త్వరగా పూర్తి చేసి వివరాలు నమోదు చేయాలని ఆదేశించారు.

అమరువీరుల స్తూపాన్ని పునర్ నిర్మిస్తాం

మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారావు

మంగపేట, జూన్ 20 : అమరువీరుల స్తూపాన్ని పునర్ నిర్మిస్తామని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహారావు అన్నారు. మండలకేంద్రంలోని గంపోని గూడెంలో అమరువీరుల స్తూపానికి లారీ తగలడంతో కూలి పోయింది. గురువారం ఆయన ఆ స్థలాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ స్థలంలో ఎన్టీఆర్ విగ్రహాన్ని పెట్టేందుకు అభిమానులు ప్రయత్నం చేయగా మరో చోట ఏర్పాటు చేసుకోవాలని కోరామని, అందుకు తాము సహకరిస్తామని చెప్పడంతో సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. త్వరలోనే స్తూపం నిర్మాణం చేపడుతామన్నారు. అలాగే రాజుపేటలో ఇటీవల మృతి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త అనుముల అప్పిరెడ్డి కుటుంబాన్ని కాకులమర్రి పరామర్శించారు. అప్పిరెడ్డి మృతికి సంతాపం వ్యక్తం చేశారు. అలాగే మంగపేట ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన టీవీఆర్ సూరిని లక్ష్మీనర్సింహారావు సన్మానించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల కమిటీ అధ్యక్షుడు కుడుముల లక్ష్మీనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ తోట రమేశ్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, కాకులమర్రి ప్రదీప్ రావు, తాటి కృష్ణ, కుర్బాన్ అలీ, కర్రి శ్యాంబాబు, గుండేటి రాజు, కాడబోయిన నరేందర్, సిద్దబోయిన లక్ష్మణ్‌రావు, నూతిల కంటి ముకుందం, చిట్టిమల్ల సమ్మయ్య, చిలకమర్రి రాజేందర్, మలి కంటి శంకర్, వాసుదేవమూర్తి, చల్లగురుగుల తిరుపతి, బాలకృష్ణ, గాదె శ్రీనివాస్, నరందర్, గోస్కుల లక్ష్మి, కాటూరి సుగుణ, వీరాస్వామి పాల్గొన్నారు.

ఎర్రచెరువు మత్తడి స్థలంలో క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు

మహదేవపూర్, జూన్ 20 : చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్ పరిధి మండల కేంద్రంలోని ఎర్ర చెరువు సామర్థ్యం పెంపుతో గతంలో ఉన్న మత్తడి ప్రదేశంలో నూతన ప్రతిపాదిత మత్తడి నిర్మాణం కోసం గురువారం క్వాలిటీ కంట్రోల్ టీం ఆధ్వర్యంలో సాయిల్ పరీక్షలు నిర్వహించారు. గతంలో చెరువు సామర్థ్యం 0.011 టీఎంసీ ఉండగా ప్రస్తుతం దాన్ని 0.044 టీఎంసీలకు పెంచిన నేపథ్యంలో ఎస్‌పీసీ (సాయిల్ బేరింగ్ కెపాసిటీ) తెలుసుకునేందుకు ఎస్‌పీటీ (సాయిల్ పెనట్రేషన్ టెస్ట్)ను నిర్వహించారు. ట్యాంక్ బండ్ లెవల్‌ను 120.73 నుంచి 123.85కి పెంచినట్లు ఇరిగేషన్ అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో డీఈ పరశురాములు, ఏఈలు శ్రీనివాస్, మధుబాబు, క్వాలిటీ కంట్రోల్ డీఈ రమేశ్‌బాబు, ఏఈలు కృష్టారెడ్డి, సంతోష్, నిర్మాణ సంస్థ (మేఘా) ప్రతినిధులు, పాల్గొన్నారు.

నులి పురుగులను నిర్మూలించాలి

- పిల్లలు భోజనం చేశాకే నులిపురుగుల నివారణ మాత్రలు వేయాలి
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ
- జిల్లా వ్యాప్తంగా ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ

విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ

కన్నాయిగూడెం/రేగొండ/కాటారం/వాజేడు/ వెంకటాపూర్/ఏటూరునాగారం /టేకుమట్ల /మహదేవపూర్(కాళేశ్వం)/పలిమెల/ చిట్యాల/ గణపురం, జూన్ 20 : బాల బాలికల్లో నులి పురుగులను నిర్మూలించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు. గురువారం మండలంలోని చెల్పూర్ మేజర్ పంచాయతీ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత, ప్రాథమిక పాఠశాలల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవంలో వారు పాల్గొని విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా 1 నుం చి 19 ఏండ్ల లోపు సుమారు 65 వేల మంది పిల్లలకు ఉచితంగా ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. నులిపురుగుల భారిన పడిన పిల్లలు రక్తహీనత, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపు నొప్పి, వికారం, వాంతులు, అతిసారం, బరువు తగ్గడం లాంటి వివిధ రకాల సమస్యలతో బాధపడుతుంటారన్నారు. కాగా, తల్లి దండ్రులు తప్పనిసరిగా పిల్లలకు మాత్రలను వేయించాలని వివరించారు. పిల్లలు భోజనం చేశాక అనంతరం మాత్రలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీవో భాస్కర్, జిల్లా వైద్యాధికారి మధుసూదన్, ఉప వైద్యాధికారి కొమురయ్య, ప్రోగ్రాం అధికారి పవన్‌కుమార్, ఎంపీపీ రజితారవీందర్, ఎంపీటీసీ మలహాల్‌రావు, ప్రధానోపాధ్యాయుడు లక్ష్మారెడ్డి, వైద్యాధికారిణి స్వాతి పాల్గొన్నారు. చిట్యాల మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో, ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఆల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కాకతీయ హైస్కూల్లో కరస్పాండెంట్ ఎండీ రాజమహమ్మద్ చి న్నారులకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. మహదేవపూర్(కాళేశ్వం) పలిమెల మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని గ్రామాల్లో అంబట్‌పల్లి, కాళేశ్వరం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ సెంటర్లు, ప్రభుత్వ పాఠశాలలో పిల్లలకు నులిపురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. ఎన్‌సీపీ బీడీసీ ప్రోగ్రాం ఆఫీసర్ ఉమాదేవి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలలో పంపిణీ కార్యక్రమాన్ని తనిఖీ చేశారు. ఎంపీపీ రాణీ బాయి, జడ్పీటీసీ అరుణ పాల్గొన్నారు. టేకుమట్ల మండలంలోని వెలిశాల పీహెచ్‌సీ ఆశాజ్యోతి ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో పిల్లలకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీపీ రెడ్డి మల్లారెడ్డి, జడ్పీటీసీ తిరుపతిరెడ్డి, స్వామిరావు, మహేందర్ పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలకేంద్రంలోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాల విద్యార్థులకు వైద్యురాలు సుమలత మాత్రలు పంపిణీ చేశారు. సూపర్‌వైజర్ కమల, ఏఎన్ఎంలు సుగుణ, సుజాత, హెచ్‌డబ్ల్యూవో శ్రీలత పా ల్గొన్నారు. అదే విధంగా మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్‌లో మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్ వైద్యురాలు వజ్జ అనూష విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేశారు. వెంకటాపూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మండల వైద్యాధికారి శ్రీకాంత్ వైద్య సిబ్బందితో కలిసి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. సీహెచ్‌వో సదానందం, పీహెచ్ఎన్ శోభ, ఏఎన్ఎం కనకలక్ష్మి పాల్గొన్నారు. వాజేడు మండలంలోని నాగారం ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు నూలిపురుగుల నివారణ మాత్రలను హెల్త్ అసిస్టెంట్ చిన్న వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. నాగారం పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్, ఉపాధ్యాయులు బాలాజీ చేతుల మీదుగా మాత్రలను విద్యార్థులకు వేయించారు. ఆశ కార్యకర్త శాంతకుమారి పాల్గొన్నారు. కాటారం మండలంలోని పీహెచ్‌సీ, సబ్ సెంటర్ల పరిధిలో వైద్యులు ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసం స్థలు, గ్రామాల్లో తిరుగుతూ నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేశారు. మం డలంలో అర్హులైన 7954 మంది పిల్లలకు గానూ 7794 మందికి మాత్రలను పంపిణీ చేసినట్లు వైద్యుడు సుమన్ తెలిపారు. ఎంపీపీ సమ్మయ్య, ఎంపీటీసీ మహేశ్వరి, హెచ్‌ఈవో తిరుపతిరెడ్డి పాల్గొన్నారు. రేగొండ మండల ప్రాథమిక ఆరో గ్య కేంద్ర వైద్యాధికారి హిమబిందు ఆధ్వర్యంలో మం డలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీపీ లక్ష్మి, ఎంపీడీవో వేంక టేశ్వర్లు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి ఉన్నారు. కన్నాయిగూడెం మండలంలోని గుర్రే వుల ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు వైద్యాధికారి అభి నవ్ నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. ఎంపీపీ సమ్మక్క, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నులి పురుగుల నివారణ మాత్రలు వేయించాలి : డీఎంహెచ్‌వో

విద్యార్థులకు మందులు వేస్తున్న అప్పయ్య

ములుగురూరల్, జూన్ 20 : పిల్లల ఆరోగ్యాన్ని కాపాడేందుకు నులి పురుగుల నివారణ మాత్రలను తప్పనిసరిగా వేయించాలని జిల్లా వైద్యాధికారి అల్లెం అప్పయ్య సూచించారు. గురువారం బండారుపల్లి మోడల్ పాఠశాలలో విద్యార్థులకు అల్బెండ జోల్ మాత్రలను పంపిణీ చేశారు. 19 ఏండ్ల లోపు పిల్లలందరికీ నివారణ మాత్రలను అందించాలన్నారు.

పాఠశాలల్లో పనులు పూర్తి చేయండి

- పనుల ప్రగతిపై నివేదికలు ఇవ్వండి
- భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి రూరల్, జూన్ 20 : అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల కల్పన పనులు ఈ నెల 27 వరకు పూర్తి చేయాలని కలెక్టర్ రాహుల్‌శర్మ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన మౌలిక సదుపాయాల పనుల పురోగతిపై విద్యా, పంచాయతీరాజ్, గిరిజన ఇంజినీరింగ్, టీజీఈడబ్ల్యూ ఐడీసీ ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 265 పాఠశాలల్లో చేపట్టిన మేజర్, మైనర్ మరమ్మత్తు పనుల పురోగతిని మండలాల వారీగా అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలలు పునఃప్రారంభమై వారం గడుస్తున్నా పనులు పూర్తికాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరమ్మత్తు పనులకు రూ.14.21 కోట్లు మంజూరు చేశామని, పనులు పూర్తయిన పాఠశాలలకు తక్షణమే రంగులు వేయాలని ఆదేశించారు. ఇంకా ఎక్కడైనా పనులు ప్రారంభించకపోతే తక్షణమే ప్రారంభించాలని, పనుల ప్రగతిపై నివేదికలు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీఈవో ఎన్ రాంకుమార్, పీఆర్ఈఈ దిలీప్, టీజీఈడబ్ల్యూఐడీసీ ఈఈ నరేందర్‌రెడ్డి, గిరిజన సంక్షేమ శాఖ ఇంజినీరింగ్ అధికారి వీరభద్రం, ఆయా శాఖల డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం నాయకులు

కలెక్టర్ రాహుల్ శర్మను తెలంగాణ రాష్ట్ర గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా నాయకులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఒంటేరు చంద్రశేఖర్, మండల రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇచ్చారు. జిల్లా కోశాధికారి రఘుపతి, అసోసియేట్ అధ్యక్షుడు ప్రభాకర్, లక్ష్మీ ప్రసన్న ఉన్నారు.

భూపాలపల్లి జిల్లాలో ట్రైనీ ఐపీఎస్‌ల బృందం పర్యటన

బరాజ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

భూపాలపల్లి రూరల్/ గణపురం/మహదేవపూర్, జూన్ 20 : తెలంగాణ దర్శన్‌లో భాగంగా రాష్ట్రానికి కేటాయించిన ఏడుగురు శిక్షణ ఐపీఎస్ అధికారుల బృందం గురువారం జిల్లా పర్యటనకు వచ్చింది. ఈ సందర్భంగా వారు కలెక్టర్ రాహుల్ శర్మను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఐపీఎస్ అధికారులు ఉమాహారతి, అజ్మీరా సంకేత్‌కుమార్, నరుల, మాల్వియా, అజయ్ యాదవ్, శ్రేష్ట,మనోజ్ అన్నారం బరాజ్, కన్నెపల్లి పంప్‌హౌస్, గణపురం మండలం ధర్మారావుపేట రెవెన్యూ శివారులోని సింగరేణి ఓసీ-3 ప్రాజెక్టును సందర్శించారు. వారికి ప్రాజెక్టు ఆఫీసర్ భిక్షమయ్య, ఎస్టేట్ అధికారి కార్తీక్ స్వాగతం పలికారు. ప్రాజెక్టు నిర్వహణ, బొగ్గు ఉత్పత్తి వివరాలను వారికి అధికారులు వివరించారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారివెంట అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, బరాజ్ డీఈ రవిచంద్ర, ఇరిగేషన్ ఏఈ, జేఈలు, మహదేవపూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ కృష్ణ, ఈవో మారుతి, ఆర్ఐ జగన్మోహన్, హరిత హోటల్ మేనేజర్ సురేశ్, తహసీల్దార్ మురళీధర్‌రావు, దేవేందర్ ఉన్నారు.

అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలి

ములుగురూరల్, జూన్ 20 : జిల్లాలో పనిచేసే అధికారులు అప్రమత్తతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. గత సంవత్సరం వరదలు వచ్చిన ప్రాంతాలను గుర్తించి వరదలు సంభవించినప్పుడు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టేలా సిద్ధంగా ఉండాలన్నారు. మొబైల్ టీమ్‌లను ఏర్పాటు చేసుకొని ముంపు ప్రాంతాలను గుర్తించాలని తాగునీరు కలుషితం కాకుండా పీఆర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. విద్యుత్ శాఖ అధికారులు కరెంట్ కోతలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దోమల నియంత్రణకు ప్రతి రోజూ గ్రామాల్లో ఫాగింగ్ చేయాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శ్రీజ, మహేందర్‌జీ, డీఎఫ్‌వో రాహుల్ కిషన్‌జాదవ్, ఆర్డీవో సత్యపాల్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేయాలి : అదనపు కలెక్టర్

ప్రణాళికను ఆవిష్కరిస్తున్న వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్, జూన్ 20 : సమయపాలన పాటిస్తూ ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. గురువారం తన చాంబర్‌లో విద్యా వార్షిక ప్రణాళిక 2024-25ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి వార్షిక ప్రణాళిక దిక్సూచి లాంటిదని, దానిని అనుసరించే ఉపాధ్యాయులు విద్యాభివృద్ధికి పాటుపడాలన్నారు. సకాలంలో విదార్థులకు పాఠాలు బోధించి పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించేలా చూడాలని తెలిపారు. డీఈవో ఎన్ రాంకుమార్, అసిస్టెంట్ డైరెక్టర్ రాజేందర్, జిల్లా ఉమ్మడి పరీక్షల బోర్డు కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి శనిగరపు భద్రయ్య, ఎంఈవో ప్రభాకర్, ప్రభుత్వ పరీక్షల నియంత్రణ అధికారి ఎం రవీందర్‌రెడ్డి, సెక్టోరియల్ ఆఫీసర్స్ రాజగోపాల్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

గూడేల్లో సమస్యలు పరిష్కరిస్తాం : ఎస్సీ

చిన్నారులకు తినుబండారాలు ఇస్తున్న ఎస్సీ శబరిష్

గోవిందరావుపేట, జూన్ 20 : గొత్తికోయగూడేల్లో సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ ద్వారా పరిష్కారానికి కృషిచేస్తామని ఎస్సీ శబరీష్ అన్నారు. గురువారం ఆయన పస్రా పరిధి బూడిద గడ్డ గొత్తికోయ గూడేన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గొత్తికోయలతో ఎస్సీ మాట్లాడుతూ అసాంఘిక శక్తులు స్వార్థ ప్రయోజనాల కోసం మాయమాటలు చెప్పి అమాయక ప్రజలను బలిచేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ విషయాన్ని గమనించి వారికి ఆశ్రయం కల్పించొద్దన్నారు. కొత్త వ్యక్తులు గూడేలకు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. గూడెంలో ప్రధానంగా తాగునీటి సమస్య ఉందని, సమస్యను తీర్చే విధంగా పోలీస్ శాఖ ద్వారా కృషి చేస్తామన్నారు. గొత్తికోయలకు అవసరమైన మందులు, సోలార్ లైట్లు, కనీస అవసరాలను సమకూర్చుతామని ఎస్సీ తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ రవీందర్, ఎస్సై కమలాకర్, ఆర్ ఎస్సై రాకేశ్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నీట్ పేపర్ లీకేజీపై జ్యుడీషియల్ విచారణ జరిపించాలి

కృష్ణకాలనీ, జూన్ 20 : నీట్ పేపర్ లీకేజీపై జ్యుడీషియల్ విచారణ చేపట్టి విద్యార్థులకు న్యాయం చేయాలని సీపీఐ భూపాలపల్లి పట్టణ కార్యదర్శి సొత్కు ప్రవీణ్‌కుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీపీఐ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో నుంచి అంబేద్కర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతర అంబేద్కర్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ నీట్ పేపర్‌ను లీక్ చేసి విద్యార్థుల భవిష్యత్‌తో చెలగాటమాడుతున్న వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఎన్‌టీఏ వల్లే 24 లక్షల మంది విద్యార్థులు జీవితాలు నాశనమయ్యాయని, వెంటనే ఎన్‌టీఏను రద్దు చేసి, వైద్యవిద్య ప్రవేశ పరీక్షను రాష్ట్రాలకు అప్పగించాలన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, రాజకీయ పార్టీలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనలు చేస్తుంటే ప్రధాని మోదీ మౌనం పాటించడం సిగ్గు చేటన్నారు.

నిరసనలో ఉద్రిక్తత..

అంబేద్కర్ సెంటర్‌లో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తుండగా పోలీసులు అడ్డుకోవడంతో ప్రధాని మోదీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దిష్టిబొమ్మను పోలీసులు లాక్కోవడంతో సీపీఐ నాయకులు, పోలీసుల మధ్య ఉద్రిక్త వాతావరణం ఏర్పడింది. కార్యక్రమంలో సీపీఐ నాయకులు నేరెళ్ల జోసఫ్, సతీశ్‌కుమార్, శ్రీకాంత్, తిరుపతి, రమేశ్, యాకూబ్ పాషా, శరత్, లావణ్య, నాగచందన, రజిత, మౌనిక, రాజేశ్వరి పాల్గొన్నారు.

జేసీబీ బోల్తా పడి డ్రైవర్ మృతి

కన్నాయిగూడెం, జూన్ 20 : జేసీబీ బోల్తా పడి డ్రైవర్ మృతి చెందిన సంఘటన మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామ చెరువు వద్ద రాత్రి తూములో పూడికతీస్తుండగా ప్రమాదవశాత్తు జేసీబీ బోల్తాపడిందన్నారు. డ్రైవర్ కార్తీక్ తీవ్ర గాయాలతో అక్కడిక్కడే మృతి చెందాడని తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

నకిలీ విత్తనాల దందాను అరికట్టాలి

చిట్యాల, జూన్ 20 : నకిలీ పత్తి విత్తనాల దందాను అరికట్టాలని సీపీఐ ఎంల్ జిల్లా కార్యదర్శి మారపల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాల్లో నకిలీ విత్తనాల అమ్మకాలు జోరుగా కొనసాగుతున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడంలేదన్నారు. కొందరు రైతులు నిషేధిత పత్తి గింజలు దళారుల నుంచి ఎక్కువ ధరలకు కొనుగోలు చేశారని, కొందరి విత్తనాలు మొలకెత్తలేదని తెలిపారు. నిషేధిత గ్లైఫోసైట్ గడ్డి మందులను కూడా యథేచ్ఛగా అమ్ముతున్నారని, అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

అడవుల సంరక్షణకు కలిసి పనిచేద్దాం

కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం, జూన్ 20 : అటవీ భూముల్లో కొత్తగా పోడు సాగు జరుగకుండా, అడవుల సంరక్షణకు కలిసి పని చేయాలని డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అన్నారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్, అటవీ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గ్రామాల్లో పోడు సమస్యలు తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కొత్తగా ఎవరైనా పోడుభూముల సాగు జోలికి వెళ్తే కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అటవీ భూముల కబ్జాకు పాల్పడేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదన్నారు. రెండు శాఖలు సంయుక్తంగా తనిఖీలు, దాడులు చేస్తూ అడవుల సంరక్షణకు నిరంతర పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశంలో సీఐ నాగార్జునరావు, సబ్ డివిజన్ ఎస్సైలు అభినవ్, నరేశ్, మహేందర్ యాదవ్, తమాషారెడ్డి, నవీన్, అటవీ శాఖ రేంజర్లు నరేందర్, కమల, డిప్యూటీ రేంజర్లు సురేందర్, రమేశ్, ఎఫ్ ఎస్‌వోలు చంద్రశేఖర్, లక్ష్మణ్‌రావు, కృష్ణ, రమేశ్, అర్చన, వినోద్, సుమన్, వరుణ్, ఇంతియాజ్, అంజయ్య, లక్ష్మణ్, అష్జల్, రాజేందర్, ఎఫ్‌బీవోలు పాల్గొన్నారు.

సివిల్ సర్వీస్ లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణ

భూపాలపల్లి రూరల్, జూన్ 20: సివిల్ సర్వీస్ -2025లో పరీక్ష రాసే అభ్యర్థులకు బీసీ స్టడీ సర్కిల్ ద్వారా లాంగ్ టర్మ్ ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా బీసీ అభివృద్ధి అధికారి టీ శైలజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో డిగ్రీ పాసైన అభ్యర్థులు జూలై 3 లోపు https:// tgbcstudycircle. cgg,gov.in ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు 040-2407 1178 నంబర్‌లో సంప్రదించాలన్నారు. అలాగే గ్రూప్-2 పరీక్షకు హాజరయ్యే విద్యార్థులకు ఆఫ్‌లైన్ గ్రాండ్ టెస్టులు నిర్వహిస్తున్నట్లు ఆమె పేర్కొన్నారు. హనుమకొండలోని బీసీ స్టడీ సర్కిల్‌లో జూలై 8,9,15,16,22, 23,30,31వ తేదీల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం12:30 గంటల వరకు, మధ్యాహ్నం 1.30 నుంచి సాయంత్రం 4 గంటల వర కు ఆఫ్‌లైన్‌లో గ్రాండ్ టెస్టులు ఉంటాయన్నారు. అభ్యర్థులు జూలై 5లోపు www. tgbcstudycircle.cgg.gov.in ఆన్‌లైన్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.

రోడ్లపై నీటి నిల్వలు లేకుండా చూడాలి

కృష్ణకాలనీ, జూన్ 20 : వర్షాకాలంలో రోడ్లు, కాలనీల్లో నీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ టీ రాజేశ్వర్ సంబంధిత అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలపై మున్సిపల్ క